క్లుప్తంగా

23 నుంచి పోలేరమ్మ కొలుపులు

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులోని పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి కొలుపులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. 23న ఉదయం 7 గంటలకు చద్దితో పూజలు ప్రారంభమవుతాయన్నారు. 30న మహాలక్ష్మమ్మ అమ్మవారి గుడి నుంచి రాత్రి 9 గంటలకు ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. 31న కొమ్మ కొట్టుట, ఆగస్టు 1న పొంగళ్లు, కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు, 2న ఘట్టం ఎత్తు కార్యక్రమం, 4న పావనం, పాలవల్లిలు, బొల్లి ఆవుల ఊరేగింపు, 5న అమ్మవారి ఊరేగింపు, 6న పోలేరమ్మ పొంగళ్లు, బండ్లు ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

అంకమ్మతల్లికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు: కందుకూరు గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ పునర్ నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు అందుతూనే ఉన్నాయి. దీనిలో భాగంగా ఆదివారం జీఎంఆర్ కూరగాయలషాపు యజమాని గుమ్మా మోహన్‌రావు, అంజలి దంపతులు తమ కుటుంబ తరుపున రూ.25,116 విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకట్‌రెడ్డికి అందజేశారు. నిర్మాణ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా వాసవి పత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బెంజిమెన్



పరశపోగు బెంజిమెన్

వెలిగండ్ల: వీఆర్‌ఓ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం విజయవాడలోని ఫిల్మ్ చాంబర్‌లో జరిగాయి. ఈ ఎన్నికల్లో వెలిగండ్ల వీఆర్‌ఓ పరిశపోగు బెంజిమెన్ వీఆర్‌ఓ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యాయి. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు అభినందనలు తెలిపారు.

నేడు జగనన్న సురక్ష

హనుమంతునిపాడు: మండలంలోని హాజీపురం, సీతారాంపురం గ్రామ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న సురక్ష జరుగుతుందని ఎంపీడీఓ జీవీ క్రిష్ణారావు తెలిపారు. సీతారాంపురంలో తహసీల్దార్ ఎస్ .హరిబాబు బృందం, హాజీపురంలో ఎంపీడీఓ జీవీ క్రిష్ణారావు బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పామూరు: మండలంలోని నుచ్చుపాద సచివాలయ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, వలంటీర్లు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

పొగాకు రైతుకు సిరుల పంట

- అధిక పొగాకు అమ్మకాలపై 5శాతం పెనాల్టీ ఎత్తివేతతో రైతులకు లాభం
- ఒక్కో రైతుకు రూ.40 వేల వరకు లబ్ధి
- కందుకూరు రెండు వేలం కేంద్రాల్లో 6 మిలియన్ కేజీల వరకు అదనపు పొగాకు

కందుకూరు:

రొట్టె ఇరికి నేతిలో పడ్డ సామెతగా ఈ ఏడాది పొగాకు రైతులకు అదృష్టం కలిసి వస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకు డిమాండ్‌తో వేలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక రేట్లు రావడం, అనధికారిక పొగాకు అమ్మకాలపై బోర్డు పెనాల్టీలను ఎత్తివేయడం, పొగాకు స్క్రాప్‌ను బోర్డులోనే కొనుగోలు చేయడం వంటివి ఈ ఏడాది పొగాకు రైతులకు అదనపు లాభాలను తెచ్చిపెడుతున్నాయి. దీంతో ఏడాది పొగాకు రైతులకు రికార్డు స్థాయిలో లాభాల పంట పడుతుంది.

6 మిలియన్ కేజీల వరకు అదనపు పొగాకు

కందుకూరులో కందుకూరు–1, కందుకూరు–2 రెండు వేలం కేంద్రాలున్నాయి. వీటిలో ఇప్పటికే రెండో వేలం కేంద్రంలో అధికారిక అమ్మకాలు పూర్తి కాగా, ఒకటవ వేలం కేంద్రంలో మరో రెండు రోజుల పాటు అధికారిక అమ్మకాలు జరగనున్నాయి. ఇప్పటికే రెండవ వేలం కేంద్రంలో 7.96 మిలియన్ కేజీల ఉత్పత్తులను అమ్మగా, ఒకటిలో 9 మిలియన్ కేజీల వరకు అమ్మకాలు జరిగాయి. ఒక్కో కేంద్రంలో 3 మిలియన్ కేజీల చొప్పున రెండు వేలం కేంద్రాల పరిధిలో 6 మిలియన్ కేజీల వరకు అదనపు పొగాకు ఉత్పత్తులు ప్రస్తుతం రైతుల వద్ద ఉన్నాయి. దీంతో రెండవ వేలం కేంద్రంలో శనివారం నుంచి అదనపు పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఒకటిలో కూడా మరో రెండు రోజుల్లో ప్రారంభం అవుతాయని అధికారులు చెప్తున్నారు. ఈ కొనుగోళ్లు ఆగస్టు వరకు జరగవచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బోర్డు అనుమతించిన పొగాకు సమానంగా అనధికారిక పొగాకును రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఉత్పత్తులను అమ్ముకునేందుకు రైతులు ఏటా క్వింటాపై 5శాతం పెనాల్టీ చెల్లించి అమ్ముకుంటున్నారు. అంటే దాదాపు క్వింటాకు రూ.1200 వరకు పెనాల్టీ రూపంలో రైతులు బోర్డుకు చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఒక బ్యారన్‌పై రూ.40 వేల వరకు పెనాల్టీని కట్టాల్సి వస్తుంది. దీంతో అదనపు పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై పెనాల్టీని రద్దు చేయాలని ఎప్పటి నుంచో రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అదనపు పొగాకు అమ్మకాలపై పెనాల్టీని రద్దు చేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ఎటువంటి పెనాల్టీ లేకుండానే రైతులు ప్రస్తుతం పొగాకు ఉత్పత్తులను అమ్ముకుంటున్నారు. ఇలా ఒక్కో రైతులకు రూ.40వేల వరకు అదనపు ఆదాయం చేకూరనుంది. అలాగే పొగాకు ఉత్పత్తులకు విపరీతమైన డిమాండ్ రావడంతో ఈ ఏడాది పొగాకు స్క్రాప్ (పొగాకు ముక్క)ను కూడా వేలం కేంద్రాల్లోనే అమ్ముకునేందుకు అనుమతి ఇచ్చింది. ఒక్కో రైతు గరిష్టంగా 5 క్వింటాళ్ల వరకు అమ్ముకునే అవకాశం కల్పించింది. అదీ కేజీకి రూ.150 వరకు ధర చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు. గతంలో ఈ స్క్రాప్‌ను రైతులు బయట వ్యాపారులకు రూ.50 నుంచి 100లోపు మాత్రమే అమ్ముకునే వారు. ఈ ఏడాది ఏకంగా బోర్డులోనే కొనుగోలు చేయడంతో ఒక్కో రైతుకు రూ. 50వేల వరకు ఆదాయం వచ్చినట్లు అయింది. మరోపక్క సాధారణ అమ్మకాలపై ఎలాగూ ఈ ఏడాది అత్యధిక రేట్లు నమోదవుతున్న విషయం తెలిసిందే. వీటికి అదనంగా బోర్డు తీసుకున్న ఈ రెండు నిర్ణయాల వల్ల రైతులకు ఆదాయం పెరిగినట్లు అయింది.



వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు

కొనసాగుతున్న అత్యధిక రేట్లు

ప్రస్తుతం పొగాకు వేలంలో అత్యధిక రేట్లు కొనసాగుతున్నాయి. కందుకూరు రెండు వేలం కేంద్రాల్లోను కేజీ పొగాకు గరిష్ట ధర రూ.245 వరకు పలుకుతుంది. కనిష్ట ధర రూ.160 వరకు వస్తుంది. దీంతో సరాసరి ధరలు కేజీకి రూ.234 వరకు నమోదవుతుంది. గతంలో ఈ రేట్లు ఎప్పుడూ లేవు. రైతులు ఊహించని రేట్లు ప్రస్తుతం వేలంలో వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బోర్డు నిర్ణయంతో రైతులకు మేలు

పొగాకు బోర్డు అదనపు పొగాకు అమ్మకాలపై పెనాల్టీని ఎత్తివేస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. ప్రతి రైతుకు క్వింటాకు రూ.1200 వరకు మిగిలినట్టే. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్ బాగుండడం వల్ల అధిక ధరలు వస్తున్నాయి. ఈ రేట్లను చూసి వచ్చే ఏడాదికి బ్యారన్, పొలం కౌలును విపరీతంగా పెంచుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను.

– రాజగోపాల్‌రెడ్డి, రెండవ వేలం కేంద్రం నిర్వహణాధికారి

జీవామృతంతో పంటలకు విలువైన పోషకాలు



ముపాళ్లలో జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న భవాని

పొన్నలూరు: రైతులు సాగుచేసే పంటకు ప్రకృతి సిద్ధమైన ఘన ద్రవ జీవామృతాన్ని వాడితే విలువైన పోషకాలతో అధిక దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ సీహెచ్ భవానీ అన్నారు. మండలంలోని ముప్పాళ్లలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భవానీ మాట్లాడుతూ స్థానికంగా దొరికే ముడి పదార్థాలతో జీవామృతాన్ని తయారు చేసుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో జీవామృతాన్ని తయారు చేసుకోవచ్చని సూచించారు. పంట సాగుకు ముందు పొలంలో పిచికారీ చేయడం వల్ల భూమిలో సత్తువ నిల్వలు పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. తద్వారా రైతు లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీపీ కోటేశ్వరరావు, పీఆర్పీ పద్మశ్రీ, కేఆర్పీ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం



రైతులకు అవగాహన చేస్తున్న రంజిత్

కొండపి: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జి వై రంజిత్ అన్నారు. మండలంలోని పెరిదేపిలో ఎస్సీ కార్పొరేషన్, ప్రకృతి వ్యవసాయ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వం వారిచే ఉచితంగా రూ. 10000 విలువైన కిట్లు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రకృతివ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్ మాల్యాది పాల్గొన్నారు.

కామేపల్లివారిపాలెంలో సినిమా షూటింగ్



సినిమా షూటింగ్‌కు క్లాప్ కొడుతున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: మన రాజ్యం సినిమా షూటింగ్‌ను వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆదివారం మండలంలోని కామేపల్లివారిపాలెంలో క్లాప్ కొట్టి ప్రారంభించారు. సిద్దార్థ్ భీమ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో దాసరి మీనా కుమారి సమర్పణలో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత దండేల కృష్ణ తెలిపారు. సినిమా షూటింగ్‌లో పాలడుగు విజేంద్ర బహుజన్ కెమేరా స్విచ్ ఆన్ చేయగా, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యులు తొలుత సినిమాకు గౌరవ దర్శకత్వం వహించారు. సెప్టెంబర్‌లో సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తామన్నారు. యదార్థ సంఘటన ఆధారంగా సందేశాత్మక చిత్రంగా నిర్మిస్తున్నామని, నటీనటుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని దర్శకుడు ఎద్దు కిరణ్‌కుమార్ తెలిపారు.

స్నేహ బంధం.. ఎంత మధురం!



పాఠశాల వద్ద పూర్వ విద్యార్థులు

మార్కాపురం: సుమారు 36 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న బాల్య మిత్రులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ అపూర్వ కలయికకు మార్కాపురం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వేదికైంది. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఆదివారం ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. అనంతరం ర్యాలీగా ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న శుభమ్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుని సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థుల్లో బ్యాంక్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలు, పారిశ్రామికవేత్తలు ఉన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాలలో తాము చదువుకున్న తరగతి గదులకు వెళ్లి అలనాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. చదువు చెప్పిన గురువులైన విశ్రాంత డీవైఈఓలు మల్లికార్జునరావు, రంగస్వామి, పీఈటీ అల్లూరయ్యను ఘనంగా సన్మానించారు. మిత్ర మండలి సభ్యులైన గుంటక సుబ్బారెడ్డి, పాదర్తి శ్రీను, అన్నా రాము, చంద్ర, జీఎల్ నరసింహరావు, నాగరాజు, తన్నీరు వెంకటరమణ, డాక్టర్ బాషా, డీవీ, కామేశ్వరరావు, ఎంఆర్‌కే బాషా, డీవీఆర్, పీవీ కృష్ణారావు, సుధాకర్, రహ్మతుల్లా తదితరులు ఆత్మీయ సమ్మేళనాన్ని సమన్వయం చేశారు. భవిష్యత్తులో మిత్ర మండలి తరపున సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కందుకూరు: పాఠశాలలో దాదాపు 8 ఏళ్ల పాటు ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ పరిధిలో దూబగుంట పాఠశాల ఉపాధ్యాయులు దాసరి బ్రహ్మయ్య, కోసూరి మాధవలు సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. దాదాపు ఎనిమిది సంవత్సరాల పాటు గ్రామంలోని విద్యార్థులను తీర్చిదిద్దారని, అనేక మంది విద్యార్థులు గురుపాఠశాలలకు ఎంపికయ్యేందుకు కృషి చేశారని వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులుగా పాఠశాలను ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. అలాగే కాంప్లెక్స్ చైర్మన్ హెచ్‌ఎం డి.అనూరాధ, కావలి పట్టణ ఎంఈఓగా నియమితులైన బండి గోవిందయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ నాయకులు బండి మాల్యాద్రి, గోచిపాతల ప్రసాద్, తుమ్ము వేణు, తలారి వంశీతో పాటు, బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కండ్లగుంట మోహన్‌రావు, ఉపాధ్యాయులు అబ్దుల్లా, ఎం రమణయ్య, కె.రవీంద్ర, తుమ్మా హరిబాబు, బండి ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 20వ వార్డులో చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అపరిశుభ్ర వాతావరణం వల్లే సీజనల్ వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఇంట్లో నుంచి వచ్చే చెత్తను ఖాళీ స్థలాల్లో, రోడ్లపై వేయకుండా చెత్త కుండిలో, మున్సిపల్ రిక్షాలో వేయాలన్నారు. వార్డుల్లో తక్షణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. స్థానికులు రోడ్లు, విద్యుత్, వాటర్ లైన్ తదితర సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. ఇందిరాకాలనీలో దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని చైర్మన్ చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పసుపులేటి దీప, ఎమ్యునిటీ సెక్రటరీ, వైఎస్సార్ సీపీ నాయకులు అరుణోధర్, షరీఫ్, ఎస్‌కే జానీ, చింతలపూడి వెంకటేశ్వర్లు, చంద్రబోసు తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి చింతలచెర్వు పూజలు



నారాయణస్వామికి పూజలు చేస్తున్న చింతలచెర్వు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామిని ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు చింతలచెర్వు సత్యనారాయణరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వంశపారపర్య చైర్మన్ ఆదినారాయణ, ఈఓ నర్రా నారాయణరెడ్డి చింతలచెర్వుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నారాయణస్వామి ఆరాధన, సమాధి అయిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి చింతలచెర్వు సత్యనారాయణకు తీర్థప్రసాదాలు, ఆలయ సాంప్రదాయాలతో దుశ్శాలువాతో సత్కరించారు. కొమ్మినేని వెంకట్రావ్, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, రామ సత్యంరెడ్డి, చైతన్య అంజి, పాలకమండలి సభ్యులు, దేవస్థాన సిబ్బంది ఉన్నారు.

1363 మంది రైతులకు పంటనష్ట పరిహారం

కొమరోలు: మండలంలో 1363 మంది రైతులకు పంట నష్టపరిహారం మంజూరైనట్లుగా మండల వ్యవసాయ శాఖ అధికారిణి రాజశ్రీ తెలిపారు. మండలంలో కందిపంట సాగుచేసి వర్షాలకు పంట నష్టపోయిన ఒక్కొక్క రైతుకు రూ.12433 వంతున రూ.2.408 కోట్ల నష్టపరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. మండలంలో 1937.3 ఎకరాల్లో కందిపంట అకాల వర్షాలకు నష్టపోయారని వెల్లడించారు.

కౌలు రైతులకు బాసట

- రైతు భరోసా అమలుతో తొలగిన కష్టాలు
- ప్రభుత్వ ఆదరణతో కౌలు రైతుల హర్షం

రాచర్ల:

గత ప్రభుత్వాలు కౌలు రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేశాయి. కంటి తుడుపుగా రుణ అర్హత పత్రాలను చేతిలో పెట్టి చేతులు దులుపుకున్నాయి. రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యాజమాన్య రైతులతో సమానంగా కౌలు రైతుల సంక్షేమానికి బాట వేసింది. బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటూనే రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసింది. పెట్టుబడి సాయంతో కౌలు రైతులకు అండగా నిలుస్తోంది. గడిచిన నాలుగేళ్లుగా రాచర్ల మండలంలో వందలాది మంది కౌలు రైతులకు పెట్టుబడి నిధి అందిస్తోంది. రాచర్ల మండలంలోని 14 పంచాయతీల్లో 15 వేల ఎకరాల సాగు భూమి ఉంది. 8 వేలకు పైగా రైతులు ఉన్నారు. 656 మంది దాకా కౌలు రైతులున్నారు. అర్హత రీత్యా 651 మందికి రైతు భరోసా పెట్టుబడి నిధి అందుతోంది. ఏటేటా కౌలు రైతుల లబ్ధి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. గడిచిన మూడేళ్లలో మండలంలో 1418 మంది కౌలు రైతులు పెట్టుబడి సాయం పొందారు. 2020 సంవత్సరంలో 402 మంది, 2021లో 365 మంది, 2022 సంవత్సరంలో 651 మందికి నిధులు మంజూరయ్యాయి.

జగనన్న ప్రభుత్వంపై కౌలు రైతులు హర్షం

గత ప్రభుత్వాలకు భిన్నంగా జగనన్న ప్రభుత్వం సంస్కరణలు తీసుకుని రావడంతో వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. ముఖ్యంగా యాజమాన్య రైతులకు సమానంగా పెట్టుబడి సాయం రూ.13,500 మంజూరు చేయడంతో పాటు పెట్టుబడి సాయం, రైతు రుణాలు, గిట్టుబాటు ధరలు కల్పిస్తుండటంతో కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పత్తి పంటలో అంతర సెద్యం చేస్తున్న రైతు

రాచర్ల మండలంలో ఇలా..

సంవత్సరం	కౌలు రైతులు	మంజూరైన పెట్టుబడి సాయం
2020	402	రూ.54,27,000
2021	365	రూ.49,27,500
2022	651	రూ.87,88,500

రైతు భరోసా అందింది



చాలాకాలంగా 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్నాను. గతంలో కౌలు రైతులను పట్టించుకునే వారు కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి రైతు భరోసా కింద రూ.13,500 నగదు అందించింది. యాజమాన్య రైతులతో సమానంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుండటంతో చాలా సంతోషంగా ఉంది.

– షేక్.నాయబ్ రసూల్, కౌలు రైతు, రాచర్ల గ్రామం

కౌలు రైతులను ఆదుకోవడం గొప్ప విషయం



గత ప్రభుత్వాలు కౌలు రైతులను పట్టించుకోలేదు. రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులను ఆదుకోవడం గొప్ప విషయం. లక్షలాది మంది కౌలు రైతులకు పెట్టుబడి నిధి అందించడం ఎంతో సంతోషం. మాలాంటి కౌలు రైతులకు రైతు భరోసా అండగా నిలుస్తోంది.

– పానెం భాస్కర్, కౌలు రైతు, యడవల్లి

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాళ్లూరు(ముండ్లమూరు): తాళ్లూరు వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991 – 1992 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, కోటిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. విద్యార్థులలో ప్రస్తుతం ఉన్నత శిఖరాలకు ఎదిగిన వారిని అభినందించి దీవించారు. తమతో పాటు చదివి నేడు కష్టంలో ఉన్న వారిని గుర్తించి వారిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. తమ వంతు సాయంగా పాఠశాల అభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెళ్లకు గాయాలు



గాయపడిన వెంకటరెడ్డి

మార్కాపురం: బైకు అదుపుతప్పి అన్నాచెల్లెళ్లు గాయపడిన సంఘటన ఆదివారం మార్కాపురం మండలంలోని చింతగుంట్ల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. త్రిపురాంతకం మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన కె.వెంకటరెడ్డి, నారాయణమ్మ అన్నాచెల్లెళ్లు. కంభంలో ఆదివారం ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నారు. ఈ క్రమంలో చింతగుంట్ల గ్రామ సమీపాన మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులకు మార్కాపురం జిల్లా వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

పోగొట్టుకున్న నగదు తిరిగి అప్పగింత

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని హోటల్ హరివిల్లులో ఓ వ్యక్తి పోగొట్టుకున్న రూ.17,500 నగదును హోటల్ యాజమాన్యం తిరిగి అప్పగించింది. ఆదివారం మండల కేంద్రంలోని హోటల్ హరివిల్లులో డబ్బులు దొరికిన విషయాన్ని సిబ్బంది యజమానులు కరీం, మజీద్‌లకు తెలపగా ఆ ప్రయాణికుడి కోసం ఆరా తీశారు. మూడు గంటల అనంతరం డబ్బులు పోగొట్టుకున్న ప్రయాణికుడు హోటల్‌కు తిరిగి వచ్చి పోగొట్టుకున్న నగదు వివరాలు తెలపటంతో యజమానులు డబ్బులు అతనికి తిరిగి ఇచ్చారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

కందుకూరు డివిజన్

90102 24456

Office mail : sakshiongads@gmail.com